


రాత్రిపూట అడివిలో పోసే రైలుఇంజన్‌లా అరిచింది గడియారం. ఉలిక్కిపడి దుప్పటివిదిలించి లేచికూచున్నాడు సంజీవిరావు. ఆరున్నర చూపెడుతోంది వెధవ గడియారం.

'అయిదున్నరకు అలారం పెడితే ఆరున్నరకు మోగుతోంది!...హుం...గడియారం కూడా చెప్పినమాట వినడంలేదు. తాను మాత్రం చచ్చినట్లు దానిమాట వినాలి'—ఈ మాత్రం ఆలోచించేసరికే దుప్పటిమడవడం అయిపోయింది.

అలారం ఆమెనుకూడా లేపింది; కాని ఆమె లేవలేదు. ఆమె లక్ష్మి.

సంజీవిరావు బాత్‌రూములోకి వెళ్ళాడు. పళ్ళుతోముకుంటుంటే గుర్తొచ్చింది. ఆమూలపన్ను తీయించి కొత్తది కట్టించుకోవాలని—రెండు నెలలనుండి అనుకుంటున్నాడు. ఏదీ—

అంట్లగిన్నెలతో పనిమనిషి ప్రవేశించింది. చిన్నప్పటి నైన్సుపాఠాలనూ, పత్రికలలో ప్రకటనలనూ మర్చిపోయిన సంజీవిరావు ఆషామాషీగా పళ్ళుతోముకొని ఇవతల కొచ్చాడు.

పడగ్గదిలో కెళుతూ చూస్తే ఇంకా కమల నిద్రపోతోంది. అదృష్టవంతురాలు! అయినా రేపొద్దున పెళ్ళయితే ఇలాపడుకోవడం కుదురుందా?

షేజర్‌లోకి బ్లేడుని అమరుస్తూ కేకేశాడు సంజీవిరావు.

"లక్ష్మి! లక్ష్మి!"


"ఏమండీ?"

"నా అద్దం ఏదీ—?"

"నిన్న నాని పగలగొట్టాడండి!"

"ఊ......"

"ఆ పెద్దద్దంలో చూసుకోండి."



# ఎదురీత

వాకాటి పాండురంగరావు

తున్నప్పుడు చెవిమీద సన్నగా తెల్లగా కన్పించింది. సబ్బు నురగేమో ననుకుని తుడిచాడు. ఊహూం ...... పోలేదు. కొత్త తెన్నీక్కు టావెల్ కుచ్చులతో తుడిచాడు. ఆ తెల్లగీత అలాగే వుంది.

'ఓయీ సంజీవిరావూ! చర్మాన్ని చూసి కూడా లక్ష్యపెడుతుంటే ఎలా గోయ్... అది సబ్బు నురగ కాదు; నెరవనున్న నెరిసిపోతున్న నీజుట్టు' — అనుకున్నాడూ సంజీవిరావు; నవ్వుకున్నాడు.

"చిత్తం!...కొంచెం వేడినీళ్ళు..."

లక్ష్మి మాట్లాడకుండా వేడినీళ్ళు తెచ్చిచ్చివెళ్ళింది. వాతావరణంలో ఏదో బాగులే దన్పించింది సంజీవిరావుకు. దానంతట అదే తెలుస్తుందిలే—అనుకున్నాడు.

షేవింగు మొదలెట్టాడు. అద్దం ముందు కూచోగానే పనితనం వస్తుంది. నాలుగు దశాబ్దాలనుండి చూసుకుంటున్న మొహమే ఏరోజుకారోజు క్రొత్తగా వుంటుంది. 'నిజం తన చిరునవ్వుని అద్దంలో చూచుకుంటే కనపడేది — అందం' అన్నాడు టాగూరు. కుడిచెంపమీదుగా లేజర్ లాగు గడ్డం తెగింది.

అయ్యబాబోయ్ - అప్పుడే తల నెరిసిపోవడమా! శీర్షాసనం వేస్తే జుట్టు నల్లగా వుంటుం దంటారు. పొద్దున్నే లేచి వేస్తే బావుంటును—

పాల సముద్రంమీద ఎర్ర కలువలా సబ్బు నురగమీద నెత్తురుబొట్టు తేలింది. ఇరవై నాలుగ్గంటల కోసారి బ్లేడుతో కలిసి ఆడుకుంటూండడంవల్ల చర్మం మొద్దు బారిపోయింది. నొప్పి తెలియడంలేదు నెతురు చుక్కని తుడిచాడు సంజీవిరావు. ఎడమ చెంప కానిచ్చాడు. మళ్ళీ కుడివైపు ఎర్ర బొట్టు తయారయింది. ఎప్పటి కప్పుడె ఇంత బోరిక్ పవుడరూ అదీ తెచ్చి ప్రథమ చికిత్స కక్కరలసిన మందుల పెట్టెలాంటిది తయారు చేయాలని అనుకోవడం... కానీ—

నిశ్శబ్దంలో మునిసి నాలుకలా 'బోంయ్' మంది మైలు కవతలవున్న మిల్లు సైరన్.

బాబోయ్! ఏడూ పదిహేనయిపోయింది!

సంజీవరావ్ పరుగెత్తుకు వెళ్ళాడు స్నానాలగది దగ్గరికి.

"లక్ష్మీ! లక్ష్మీ! నీళ్ళయిందా... టైమయిపోతోంది."

"అయిపోయిందండీ!" తడిబట్ట చుట్టుకుని బయటికి వచ్చింది లక్ష్మి. ఆమె వైపు చూశాడు. ఆ నిమిషంలో ఇరవై ఏళ్లు వెనక్కు వెళ్లాడు. లక్ష్మి-అప్పుడు సన్నగా విద్యుత్కిరణంలా వుండేది; ఇప్పుడునిండుగా వున్న ప్రదీపంలా వుంది.

"అలా చూస్తారేమిటి క్రొత్తగా-స్నానం కానివ్వండి."

"స్నానం కానిచ్చి వస్తున్నా"డు సంజీవిరావు. కమల ఎదురయింది.

"ఏమమ్మా...ఇంత ఆలస్యంగా లేచావేం?"

"రాత్రి ఏదో చదువుకుంటూ పడుకునే సరికి పన్నెండు దాటింది నాన్నా—"

"మరయితే నీకు ఇడి టైమయిపోదూ-"

"ఆ...అయితే అవనీ నాన్నా - వెధవ టైము! మహా అయితే ఓ సెలవు కాగితం పడేస్తేసరి" అని అవలీన్గా స్నానాలగదివైపు సాగింది కమల.

పుస్తకాలు చదవడం - వెధవ టైము - సెలవు కాగితం - ఇవన్నీ ఎక్కడో విన్నట్లనిపించాయి. బట్టలు తొడుక్కుంటున్న సంజీవిరావుకు. హుఁ! 'టైం'కి ఎన్ని ముడతలో...ఇస్త్రీ చేస్తే బావుండును. ఇస్త్రీ పెట్టెకూడా వుంది. కాని చేతిగడియారం ఎనిమిది చూపుతూంది.

"టిఫిన్ ఇదిగో..."

"లక్ష్మీ..."

"ఏమండీ..."

"ఏదోలా వున్నావే-?

"ఏమీ లేదండీ!"

"నాని లేవలేదూ ?"

"ఇదిగో లేస్తున్నా...లేపుతాను."

ఉప్మా, కాఫీ అయ్యాయి. ఉప్మాలోని కరివేపాకు ఘుమఘుమ, నేతిలో వేగిన జీడిపప్పుల రంగు, రుచి, వేడికాఫీలోని వెచ్చటి కమ్మదనం-కసుక్కుసుకంగానే తినడం, తాగడం అయింది.

"నాన్నా ! ఇదిగో పేపరు !" అంటూ నాని వచ్చాడు.

"ఒరేయ్ ! ఇంతసేపట్రా పడుకోవడం ? నేను చూడు—అప్పుడే స్నానం కూడా చేసేశాను-"

"నువ్వు ఆఫీసుకు వెళ్తావు నాన్నా."

"అరి వెధవా !" అని వాడినెత్తుకుని ముద్దాడబోయిన సంజీవిరావుకు తెల్ల చొక్కా-దాని మడతలూ పాడయిపోతాయన్న తెలివి కలిగి వాడిని క్రిందకు దింపేశాడు. "ఊఁ! అయితే నేను ఆఫీసుకు పోతాను గనుక ముందు లేచానంటావ్...మరి నువ్వు రేపు విజయదశమినుండి బళ్ళోకి వెళ్తావే-అప్పుడూ ?"

"ఊఁ...వెళ్తా నాన్నా."

"గుడ్ ! వెరీగుడ్ !" కోటు తొడుక్కున్నాడు సంజీవిరావు. 'పూలయితే లేసులు వేసుకుంటూ కూచోవాలని 'స్లిపాన్స్' తొడుక్కున్నాడు.

"నాన్నా ! మరే...నన్ను ఎగ్జిమిషన్‌కి తీసుకెళ్తానన్నావు-ఎప్పుడూ-"

"ఎగ్జిమిషన్ కాదురా నానీ ! ఎగ్జిబిషన్ ! ఏదీ-అను-ఎగ్జిబిషన్ !"

"ఎగ్జిబిషన్"

"ఆ...అదీ—భేష్! రోజూ కాసేపు కూచుని ఇంగ్లీషు అదీ చెప్పించినా బావుండును...అయినా కమల టీచరుకదా-చెప్పకూడదూ ?"

"మరి ఎప్పుడు వెళ్దాం నాన్నా ?"

"ఓ! వెళ్దాంలేరా అబ్బాయ్. ఆదివారం నాడు వెళ్దాంలే" ఆదివారం నాడు ఆఫీసులో ఓ స్పెషల్ రిపోర్టు ఇవ్వాలన్న విషయం సంజీవిరావుకు జ్ఞాపకం లేక కాదు. ఆదివారం మామూలుగా ప్రపంచంలో అన్ని ఆఫీసులకూ సెలవురోజు కదా అని-

# ఎదురీత

"నాన్నా! నాకొ డిజైన్లపుస్తకం తెచ్చిపెడతానని పదిరోజులక్రింద చెప్పావు ?"

"ఇవాళ తెస్తాన్లేవే! మీ అమ్మేదీ—లక్ష్మీ! వెళ్తున్నా! ఇవాళ మధ్యాహ్నం హోటలులో భోజనం చేస్తా. కేరియర్ పంపకు."

సంజీవిరావు హుటాహుటిగా నడిచివెడుతున్నాడు. బస్‌స్టాండ్ గడియారం నాలుగు ముఖాలూ కలిసి సరాసరిగా ఎనిమిదీ ఇరవై రెండు చెప్పాయి. అది చూచిన సంజీవరావ్ ఇంచుమించుగా పరుగెత్తాడు. ఎనిమిదీ ముప్ఫయొకటికి అవడిస్టేషన్ చేరిన సంజీవి

> ఆస్పత్రికి వెళ్దామనుకున్న ఓ పెద్దమనిషి దారినపోయేవాన్ని పిలిచి "అయ్యా, ఆస్పత్రికి దారి ఎటువైపు" అని అడిగాడు. అతగాడు ఓ రెండు నిమిషాలు ఆలోచించి "కళ్లు మూసుకొని పదిగజాలు తిన్నగా నడవండి. కళ్లు తెరిచేసరికి ఆస్పత్రిలో వుంటారు" అని జవాబిచ్చాడు.
>
> —గో. వా. నా. (విశాఖ)

రావునో రూముక్కా కలిసి పనిచేస్తున్నాయి. అమ్మయ్య ఇంకో పదినిముషాల్లో రైలురావాలి- గంట ప్రయాణం- సెంట్రల్లో దిగి బస్సెక్కాలి- మౌంట్‌రోడ్ వెళ్ళాలి- ప్రక్కకుతిరిగి, కిల్లీదుకాణం ముందున్న దినపత్రిక తాలూకు పోస్టరు చదివాడు.

"బాంబు ప్రేలుడు- దినవ కొరియాలో. ప్రధాని హెచ్చరిక ; భాషా వైషమ్యంపై"

సంజీవిరావు విసుక్కున్నాడు. తనకు రోజూ ప్రొద్దున్నే పత్రికవస్తుంది. కాని ఇలా పోస్టర్లు చదవడం, ట్రెయిన్‌లో ఎవరిదగ్గరో పుచ్చుకుని చూడడం- తప్పదు.

* * *

"సంజీవి...'సూపర్ సీడ్' లో 'సి' లేదయ్యా—'ఎస్' వుందీ, అని చెప్పలేదూ?" అన్నారు మేనేజరు వెంకట్రమణయ్యగారు తెల్ల తలపాగా క్రింది నల్లకళ్ళజోడుగుండా చూస్తూ—

"అలాగేనండి !"

"ఇదంతా నరాల బలహీనతవల్ల వస్తుందోయ్ ! అందుకేమీలేదు, ఒక్క డోసు 'నేట్రంమూర్ - 30 ఎక్స్' వేసుకో! ఆ తర్వాత అన్నడిగిచూడు"

వెంకట్రమణయ్యగారి ప్రక్కవాటాలో హోమియోపతి డాక్టరున్నారు. ఓకానొక రోజు చదువుకోడాని కేమీ లేకపోతే హోమియోపతి పుస్తకం చదివేసి వారం రోజులు తిరక్కుండానే ఓ పెట్టిమందులు తెప్పించేశారు వెంకట్రమణయ్యగారు. అప్పటినుండీ స్పెల్లింగులు సరిగ్గా రాయడానికి-అధికారులమీద నిర్లక్ష్యం తగ్గడానికీ- చేతివ్రాత అందంగా కుదరడానికీ-వేగంగా నడవడానికీ కూడా ఆయనహోమియోపతీమందులు ఇవ్వడం మొదలు పెట్టారు. తాను చెప్పి ఎవరయినా కొనక పోయినట్లు తెలిస్తేచాలు మరునటి రోజు తానే ఆ మందు పట్టుకొచ్చి యిచ్చి పావలావో అరణాలో అడిగి పుచ్చుకునే వారు.

సంజీవిలాంటి వారు — పన్నెండుమంది ఆయన చేతిక్రింది గుమాస్తాలు—చచ్చినట్లు పావలా ఇచ్చి-ఆమందు పుచ్చుకునేవారు. కాస్త తలనొప్పి అదీ వుందనీ సంజీవిరావు కంటి డాక్టరుకో ఏమో, కళ్ళజోడుకో పాతిక తగలెట్టి తొడుక్కుంటే—"యూఫ్రేసియా, రూటా - జి, లాంటి హోమియో మందులుండగా కళ్ళజోడు వేసుకుంటావా ? ఇసీ ! 'హానిమాన్' ఏమంటాడో తెలుసా ?" అని చెవినిల్లు గట్టుకుని పోరి సెలరోజులు తిరక్కుండా సంజీవిరావుకూ- సులోచనాలకూ విడాకు లిప్పించి తాను మందు లివ్వడం మొదలెట్టారు వెంకట్రమణయ్యగారు. తత్ఫలితంగా సంజీవిరావు ఆఫీసు గుమ్మంలో అడుగుపెట్టగానే కళ్ళజోడు తీసి కోటుజేబులో పెట్టుకుని లోపలికి అడుగువేసేవాడు. కళ్ళజోడు లేకుండా ఆఫీసు కాగితాలు చదువుతుంటే బూజుబూజుగా అనిపించేది. రాస్తుంటే కళ్ళు నొప్పెట్టేవి. నీళ్ళు వచ్చేవి. వెంకట్రమణయ్యగారు మందు మార్చి మందు ఇస్తుండేవారు, పావలాలు వసూలు చేస్తుండేవారు. "ఇది నీకోసం ప్రత్యేకం కలకత్తానుండి తెప్పించానోయ్!"—అనీ, "ఏమనుకున్నావో...ఇది ఒరిజినల్ 'బోరిక్ టాఫిల్' వాళ్ళది! 'బోరిక్ టాఫిల్' అంటే ఏమిటో తెలుసా—మీ మిల్కుటాఫీ కాదుసుమీ !" అనీ-ఘట్టిగా పెద్దగా ఘల్లున నవ్వి—అమెరికా అనే దేశంలో సదరు బోరికుడూ-టాఫీలుడూ అన్న మిత్రులిద్దరూ ఆ యుగంలో పుట్టారననీ, వాళ్ళు పూర్వం అశ్వినీ దేవతలననీ, చరకుడూ ధన్వంతరీ వగైరా గుంపంతా వాళ్ళ దగ్గర కంపౌండర్లగా పనిచేస్తుంటా రనినీ—వెంకట్రమణయ్య వివరిస్తుంటే—ఆపైన రాసిన వాక్యం వాక్యమేనా, తాను రాసిందేనా అని నమ్మలేక

తన్వరలో ఉంటుంచేవాడు సంజీవిరావు. వెంకట్రమణయ్యగారి నల్లకళ్ళజోడుని తీసి కొనడియన్ ఇంజన్ క్రింద పెడదామనికూడా అనిపించేది.

పనిచేస్తున్న గుమాస్తా వెనుకవచ్చి, మాట్లాడకుండా నిల్చోవడం వెంకట్రమణయ్యగారి మరో అలవాటు. ఆయన నీడ తనముందున్న కాగితం మీద పడుతుంటే—గుమాస్తాకు—జవాబు తెలియక పడికొట్టుకుంటున్న పరీక్షా విద్యార్థి వెనుక వాచర్ నిల్చున్నట్లు — అన్పించేది.

“సంజీవిరావుగారూ - మీకు రెండు ఉత్తరాలొచ్చాయి-” అందుకున్నాడు సంజీవిరావు.

ఒకటి కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతున్న చంద్రశేఖరంది—“...ఈసారి కెరం జీతంతోబాటు హాస్టల్‌కి కాకుండా మరో పాతిక ఎక్కువ పంపించు నాన్నా! మొన్న పిక్‌నిక్ వెళ్ళినప్పుడో స్నేహితుడి కెమెరా పట్టుకెళితే క్రిందపడి ఒక మర విరిగింది. దాని ‘రిపేరింగ్’కి ఇరవై అవుతుందిట...” అంటే మామూలు వందా ఇరవైతో ఇంకో పాతిక!

రెండో ఉత్తరం—“...పెద్దదయిన ఆడది ఉద్యోగం చేయడం నాకంతగా నచ్చదు. కమలకో సంబంధం చూశాను. కాబట్టి త్వరగా వచ్చి ఇది తేల్చుకుని వెళ్ళు...కోడలికి అక్కుస్సులు...” అంటారు నాన్నగారు.

ఈ ఉత్తరాలను రెండేసిసార్లు చదువుకున్నాడు సంజీవిరావు. మడిచి జేబులో పెట్టుకుంటుండగా ఏదో చేతికి తగిలితే బయటికి తీశాడు. మూడు రోజులనుండి పోస్టుచెయ్యాలనుకుంటున్న కవర్ నవ్వింది.

“ఆ డి. ఓ. ఏమయింది?” వెంకట్రమణయ్యగారి నీడ సంజీవి రావు వీపు మీద పడింది.

“ఇదుగో అయిపోయిందండీ—”

“ఒంటి గంటకు డైరెక్టర్ కేంప్ వెళ్ళిపోతున్నారని తెలుసుగా—”

గడియారం ఒకటి కొడుతూండగా సంతకం చేయించిన డి. ఓ. ఉత్తరంతో బయటపడ్డాడు సంజీవిరావు.

ఆఫీసునుండి నడిచాడు.

నడిచి - నడిచి - చాలదూరం వెళ్ళాడు.

ఉలిక్కిపడి చేతిగడియారం చూసుకుంటె రెండున్నరయింది. ఒంటిగంటనుండి రెండుదాకా ‘విశ్రాంతి’ సమయం.

‘నేడే! 8-8-60! నేడే విడుదల - మహత్తర బృహత్తర...’

ఓ. ఇల్లంత బోర్డుమీద మనుషులంత అక్షరాలు చూశాడు సంజీవిరావు!

మార్చి మూడవ తేది!

హన్నా! తానెంత మతిమరుపు మనిషయిపోయాడూ! ఇరవైయేళ్ళ క్రితం - ఈరోజు - లక్ష్మి తన జీవితలక్ష్మి అయింది. ఈ ఇరవైయేళ్ళలోనూ ప్రతి మార్చి మూడవ తేదీనాడూ తాను ఆఫీసుకు సెలవు పెట్టేవాడు. తనూ లక్ష్మీ పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూలా అయి, మళ్లీ ఆ మొదటిరోజు ఆనందంకోసం వెయ్యి వలలు విసిరేవారు. ఆ అనుభూతికోసం పదివేల అయస్కాంతాలతో ప్రయత్నించేవారు. ఆ రోజు ఇంట్లో వంట మానేసి హోటలు కెళ్లేవారు. సినిమాకో, బీచికో, జూకో, బోటుషికారుకో వెళ్లేవారు. మొదట కమల, శేఖరం, తర్వాత నానివస్తే వాళ్ళందరితో కలిసి ఆరోజు ఓక ఉత్సవదినంగా గడిపేవారు. మార్చి మూడు! సంవత్సరంలో అన్ని పండగలలోనూ పెద్దదయిన పండగరోజు!...పొద్దున లక్ష్మి ముభావానికి కారణం ఇదన్నమాట...పోనీ తానయినా చెప్పివుండకూడదూ - హుం! తను ఇంటిదగ్గర అన్నిసార్లు విధవగడియారం కేసిచూశాడే ఒక్కసారి కేలెండరువైపు చూసివుంటే - ఇంతెందుకు - ఆఫీసుకు వచ్చి తారీఖువేసి ఇన్ని ఉత్తరాలు రాశాడు కదా అప్పుడుకూడా గుర్తుకురాలేదే-ఏమయిపోయాడు తను? ఏం వచ్చేసింది తనలోకి? జారిపోవుతున్నట్లనిపిస్తూంది ఏమిటి?

సంజీవిరావు మథనపడ్డాడు.

మూడయింది. కనీసం ఇప్పుడయినా తిన్నగా ఇంటికివెళ్లి లక్ష్మిని ఎక్కడికయినా తీసుకువెళితే బాగుంటుంది.

చెమటపోస్తుంటే కోటుబొత్తాలు పైవి రెండూ విప్పాడు. కుడిప్రక్కకు బరువుగా వాలింది కోటు. ఆ ప్రక్కజేబులోని ఉత్తరాలు రెంటిని ఎడమజేబులోకి సర్దాడు సంజీవిరావ్.

ఆ కవర్ పోస్ట్ చేయాలి. అబ్బాయికి డబ్బు ఎక్కువ పంపాలి-ఇవాళ మనియార్డర్ టైమయిపోయింది. వచ్చే ఆదివారంతో కలిపి రెండురోజులు సెలవు పెట్టి వెళ్ళి నాన్నగారు రాసిన ఆ సంబంధం ఏదో చూసి రావాలి. వెళ్ళేముందే పన్ను కట్టించుకోవాలి. అన్నట్టు ప్రథమ చికిత్స పెట్టె తయారుచేసుకోవాలి. అసలు రేపొద్దున్నుండి ఇంకా ముందు లేవాలి. శీర్షాసనం వేయాలి. పేపర్ చదవాలి. త్వరగా లేవాలంటే ఆ గడియారం రిపేర్ చేయించాలి లేదా క్రొత్తది కొనాలి.

బస్‌స్టాపులో నలభైనిముషాలు నిల్చున్నాడు సంజీవిరావు. ఒక్క బస్సు రాలేదు. మూడున్నర కావస్తూంది. టాక్సీలో వెళితే? అయ్య బాబోయ్, ఇరవై రెండు మైళ్ళకూ ఏ పదిరూపాయలో అవుతుంది. ఆ పదికింకో పదో పదిహేనో కలిపితే లక్ష్మికో చక్కటి చీరవస్తుంది. అసలు ముందు తను ఇంటికెళ్ళి లక్ష్మికి చెప్పుకోవాలి. మూడున్నరయిపోయింది.

సంజీవిరావ్‌కు కోపంవచ్చి, వాచీని విప్పి కోటులోపలి జేబులోకి కుక్కాడు.

> క్లాసులో ఓకుఱ్ఱాడు అతిగా వాగేస్తుంటే మేష్టరు తను చెబుతున్న పాఠం నిలిపేసి ఇలా అడిగాడు:—
>
> “ఏరా వెధవా! ఈ క్లాసులో పాఠాలు చెప్పేది నేనా నీవా?”
>
> కుఱ్ఱాడు:—“మీరే నండి.”
>
> మేష్టారు:—“మరెందుకైతే గాడిదలా అరుస్తున్నావ్?”
>
> బాబు (విల్లివాక్కం)

బస్‌స్టాపులో జనమేలేరే! ఓహో - ఇవాళ ఆఫీసులున్న దినం - ఇంకా ఆఫీసులొదిలే వేళ కాలేదు. అన్నట్టు తను మేనేజర్‌కి ఫోన్ చెయ్యొద్దూ - ఏదో ఒక అబద్ధమాడాలి.

లక్ష్మికి ఏదయినా కొనాలి. ఆమె నెక్కడికయినా తీసుకు వెళ్ళాలి.

కమలకు డిజైన్ పుస్తకం కొనాలి.

నానికి ఎగ్జిబిషన్ కొనాలి.

తనకు—??

ముందు ఫోన్ చెయ్యాలి.

రోడ్డుదాటి అవతలి హోటల్లో వున్న ఫోన్‌దగ్గరికి వెళ్ళాడు సంజీవిరావు.

“...అవును...హఠాత్తుగా అరటిపండు తొక్కమీద కాలు వెయ్యడంవల్ల జారి క్రిందపడ్డాను. కొద్దిగా దెబ్బతగిలింది. టాక్సీమీద ఇంటికి వెళ్ళిపోతున్నాను పర్మిషన్ కావాలి...”

“...ఓహో...చిన్న దెబ్బ కదూ...చర్మం కొంచెం ఊడిందా? ఏమీలేదు...‘ఆర్నికా టించర్’ని పైన రుద్ది లోపలికి ‘లెడంపాల్ స్టర్’ పుచ్చుకో...ఊఁ...వెళ్ళు వెళ్ళు...ఎప్పుడు వచ్చినతర్వాత కావలిస్తే ‘బెలడోనా-మూడు ఎక్స్’...”

సంజీవిరావు ఫోన్ పెట్టేశాడు. వెడుతూ రోడ్డుమీదకు చూశాడు. గంటసేపటినుండి తాను ఎదురుచూసిన బస్సు, స్టాపులో ఆగకుండా అర్జునుడి రథంలా వెళ్ళిపోతూంది.

కుర్చీలో కూర్చుండిపోయాడు.

“ఏం కావాలి సార్?” అని పట్టేని వల్లించి నిల్చున్నాడు సర్వర్.

“ముందు రెండు బాదుషాలూ, ఒక ప్లేటు పకోడాలూ, తర్వాత జీడిపప్పు రెండు పెసరట్లూ, ఉప్మా...”

“పార్సిలు కట్టమంటారా—?”

“కాదోయ్!”

హోటల్ గడియారం నాలుగుకొట్టింది. —తలెత్తి ధీమాగా గడియారంవైపుచూసి నవ్వేశాడు సంజీవిరావు. ★